సాక్షి
అన్నమయ్య జిల్లా
మంగళవారం । 24 । డిసెంబర్ । 2024



ఈశ్వరీదేవి మఠం.. ఉత్సవ శోభితం

బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవి మఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. - 8లో



కరుణామయుడు ఏసుక్రీస్తు

ఏసుక్రీస్తు కరుణామయుడని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో క్రిస్మస్-2024 హైటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.160	రూ.220
రెండోరకం	రూ.100	రూ.150

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 170 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు ఐచ్ఛిక సెలవు

రాయచోటి (జగదాంబసెంటర్) : అన్ని ఉపాధ్యాయ సంఘాల అభ్యర్థన మేరకు ఈ నెల 24న ఐచ్ఛిక సెలవుగా ప్రకటించినట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి కె.సుబ్రమణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ, మండల విద్యాశాధికారులు, అన్ని యాజామాన్యాల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గుర్తించాలని ఆయన తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్ : అన్నమయ్య జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి డిసెంబర్ 24 నుంచి జనవరి 6వ తేదీ వరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఐసీడీఎస్ పీడీ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు 12, సహాయకులు 93, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు 11 పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుఫారాన్ని annamayya. ap. gov. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. లేనిపక్షంలో సంబంధిత ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం నుంచి పొందొచ్చని తెలిపారు.

చౌక దుకాణాల నిర్వహణకు..

రాయచోటి టౌన్ : రాయచోటి రెవెన్యూ పరిధిలోని 10 మండలాల్లో ఉన్న 116 చౌక దుకాణాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో ఏ. శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు ఈ నెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. చిన్నమండెంలో -15, గాలివీడు -12, గ్రుంకొండ -9, కలకడ -10, కంభంవారిపల్లె-9, లక్కిరెడ్డిపల్లె - 8, పీలేరు - 10, రామాపురం - 24, రాయచోటి - 12, సంబేపల్లె -07 దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇంటర్ పాస్ అయి ఉండాలని, 18 -40 సంవత్సరాల లోపు వారై ఉండాలన్నారు. ఆయా ప్రాంతాల వారీగా కేటాయించిన రిజర్వేషన్ ప్రకారమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం



గంగనపల్లి వెంకటరమణ

రాజంపేట టౌన్ : విజయవాడలో ఈనెల 28వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరిగే ఆరో తెలుగు ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు రాజంపేట పట్టణానికి చెందిన తెలుగుపండితుడు గంగనపల్లి వెంకటరమణకు ఆహ్వానం అందింది. ఈ విషయాన్ని సోమవారం ఆయన ఇక్కడ విలేకరులకు తెలిపారు. అమ్మభాషను కాపాడుకుందాం..ఆత్మాభిమానం పెంచుకుందాం అన్న నినాదంతో ప్రపంచ తెలుగు రచయితల సంఘం, కృష్ణాజిల్లా రచయితల సంఘం, కేబీఎన్ కళాశాల సంయుక్తంగా ఈ మహాసభలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెంకటరమణకు తెలుగుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు బొట్టు రామచంద్రయ్యనాయుడు, బీవీ. నారాయణరాజు అభినందనలు తెలిపారు.

జెడ్పీ హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



10వ తరగతి విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఆర్జేడీ శామ్యూల్‌రాజు

సిద్దవటం : మండలం లోని భాకరాపేట లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సోమవారం విద్యాశాఖ ఆర్జేడీ శామ్యూల్‌రాజు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మొదట మధ్యాహ్న భోజనం వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. ఈరోజు మధ్యాహ్నభోజనంలో మెనూ ఏముందని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన ఆఫీసు రూమ్‌లోకి వెళ్లి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల ఆన్‌లైన్ హాజరును పరిశీలించారు. అనంతరం 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. కష్టపడి చదవాలని, ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకేశమ్మ, ఫిజికల్ డైరెక్టర్ రామచంద్ర, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ



పల్లకిలో ఊరేగుతున్న శ్రీ భద్రకాళీ సమేతుడు

రాయచోటి టౌన్: రాయచోటి శ్రీ భద్రకాళీ సమేతుడికి పల్లకీ సేవ నిర్వహించారు. సోమవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు అభిషేకాలు,పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను పూలు, బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి పల్లకీలో కొలువుదీర్చారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి,భక్తులు పాల్గొన్నారు.

ఇదేమి కార్యాచరణ!

- సర్దుబాటుతో ఉన్నమతి పోతోందంటున్న పదోతరగతి విద్యార్థులు
- సిలబస్ పూర్తికాకుండానే కార్యాచరణకు సిద్ధమంటున్న ప్రభుత్వం



సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో పాల్గొన్న పదో తరగతి విద్యార్థులు

రాయచోటి : పదోతరగతి పరీక్షలకు సమయం ముంచుకొస్తోంది. మార్చి మూడో వారంలో పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ప్రత్యేక ప్రణాళికతో విద్యార్థులను సన్నద్ధం చేయాలని ప్రభుత్వం విద్యాశాఖాధికారులను ఆదేశించింది. జిల్లాలో 30 శాతంకుపైగా పాఠశాలల్లో సిలబస్ పూర్తికాక పది పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో అర్థంకాని పరిస్థితిలో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఏటా డిసెంబర్ మాసాంతానికి సిలబస్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అయితే ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరవుతున్నా చాలా పాఠశాలల్లో సగం సిలబస్ కూడా పూర్తి కాలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులను బదిలీలు చేయడం, 40 మంది విద్యార్థులతో ఉండాల్సిన తరగతి గదులు 53 మందితో నింపడమే కారణం. ఈనెల చివరికల్లా పాఠ్యాంశాలను పూర్తిచేయాలని టార్గెట్ పెట్టినా ఫలితం రాదన్న ఉద్దేశంతో ఒకవైపు ప్రత్యేత తరగతులను నిర్వహిస్తూ మిగిలిన సిలబస్ పూర్తి చేసేలా చూడాలని విద్యాశాఖ అధికారులు పురమాయిస్తున్నారు. జిల్లాలో 304 ప్రభుత్వ పాఠశాలల్లో 15333 మంది విద్యార్థులు పదోతరగతి చదువుతున్నారు. వీరంతా మార్చిలో జరిగే పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం కావాల్సి ఉంది.

బోధనకు ఆటంకం....

ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, ఉపాధ్యాయుల కొరత, స్థానిక పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు పదోతరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థుల బోధనకు ఆటంకంగా మారింది. ఈ విద్యా సంవత్సరంలో అక్టోబర్ 5వ తేదీ నుంచి 11 వరకు ఎస్ఏ-1 పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు పూర్తికాగానే దసరా సెలవులు రావడం బోధనపై ప్రభావం ఏర్పడింది. సెప్టెంబర్ నెలలో ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ బదిలీల్లో కోర్టు కేసులు, ఇతర కారణాలు అడ్డంకిగా మారాయి. అనంతరం జరిగిన ఎన్నికల షెడ్యూల్ విడుదల పదోతరగతి విద్యార్థుల పాలిట శాపంగా మారిందని చెప్పవచ్చు. ఆ ఎన్నికల్లో పాల్గొన్న ఉద్యోగులకు డిసెంబర్ ఒకటో తేదీన సెలవుగా ప్రకటించారు. అనంతరం వచ్చిన ఉపాధ్యాయులు పాఠ్యాంశాల బోధనలో ముందుకు సాగుతున్నారు. ఈ క్రమంలో ఉన్నతి,లక్ష్యం పేరుతో కార్యక్రమాలు, కాంప్లెక్స్‌ల పరిధిలో ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.దీనివల్ల బోధనకు అడ్డంకులు ఏర్పడ్డాయి. ఇదే సమయంలో ఈ నెల 25 నుంచి ప్రారంభం కానున్న క్రిస్మస్ సెలవులు కూడా ఇరకాటంలో పడేశాయి. జనవరి నెలలో సంక్రాంతి సెలవులు రానున్నాయి. ఈ సెలవులు కూడా సిలబస్ పూర్తి కావడానికి అడ్డంకిగా మారనున్నాయి.

ప్రత్యేక తరగతులు.

పదోతరగతి విద్యార్థులకు గత నెల నుంచి ప్రారంభమైన ప్రత్యేక తరగతులు లాభం కంటే నష్టాన్ని, కష్టాన్ని తెచ్చి పెట్టాయన్న ఆవేదన విద్యార్థులు, ఉపాధ్యాయులలో కనిపిస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. ఏయే పాఠశాలలో సిలబస్ పూర్తి కాలేదు, వాటిపై ప్రత్యేక దృష్టి సారించి ప్రయత్నానికి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వం ఒకవైపు చర్యలు చేపడుతున్నా కొత్త నిర్ణయాలు, స్థానికంగా నెలకొన్న సమస్యలు పాఠ్యాంశాలను పూర్తికానివ్వకుండా చేస్తున్నాయి. దీంతో పదోతరగతిలో మంచి ఫలితాలను సాధిద్దాం అనుకున్న విద్యార్థులకు శాపంగా మారింది.

వందశాతం ఉత్తీర్ణతకు చర్యలు



పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాం. మిగిలిన పాఠ్యాంశాలను ఈనెల చివరికల్లా పూర్తి చేయాలని ఆదేశించాం. ఇప్పటికే 75శాతం పాఠ్యాంశాలు పూర్తయ్యాయి. ప్రత్యేక తరగతులు ద్వారా మిగిలిన సిలబస్ పూర్తి చేయాలని సూచించాం. ఉదయం 8,9 సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నాం. విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకోసం మోడల్ పేపర్లను రిలీజ్ చేశాం.

– సుబ్రమణ్యం, జిల్లా విద్యాశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

నేటి నుంచి మాజీ సీఎం వైఎస్ జగన్ పులివెందుల పర్యటన



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పులివెందుల రూరల్ : వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈనెల 24వ తేదీ నుంచి నాలుగు రోజులపాటు పులివెందులలో పర్యటించనున్నారు. 24వ తేదీన ఉదయం 11 గంటలకు బెంగళూరు నుంచి ఇడుపులపాయ చేరుకుని దివంగత వైఎస్ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం ప్రేయర్ హాల్‌లో జరిగే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. ఆ తర్వాత కడప నియోజకవర్గ నాయకులతో సమావేశమవుతారు. సమావేశం అనంతరం మధ్యాహ్నం 3.30 గంటలకు ఇడుపులపాయ నుంచి పులివెందుల బయలుదేరి వెళ్లి రాత్రికి అక్కడ నివాసంలో బస చేస్తారు. ఈనెల 25వ తేదీన ఉదయం 8.30 గంటలకు క్రిస్మస్ సందర్భంగా సీఎస్ఐ చర్చిలో జరిగే క్రిస్మస్ వేడుకల్లో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2.30 గంటలకు తాతిరెడ్డిపల్లిలో రామాలయాన్ని ప్రారంభించిన అనంతం పులివెందుల చేరుకుని రాత్రికి బస చేస్తారు. ఈనెల 26వ తేదీ పులివెందులలోని తన క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రజా దర్బార్ నిర్వహిస్తారు. ఈనెల 27వ తేదీన ఉదయం 9 గంటలకు పులివెందుల విజయా గార్డెన్స్‌లో జరిగే వివాహానికి హాజరవుతారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి బెంగళూరు వెళతారు.

మాజీ సీఎం వైఎస్ జగన్ రాక ఏర్పాట్లను పరిశీలించిన ఎంపీ

లింగాల : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తాతిరెడ్డిపల్లె గ్రామంలో పర్యటించనున్నారు. శ్రీసీతారాముల విగ్రహ ప్రతిష్ట వేడుకలో ఆయన పాల్గొంటారని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులతో, ఎస్ఐ మధుసూదనరావుతో ఎంపీ చర్చించారు. భద్రతా ఏర్పాట్లపై ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు మల్లికేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, పుల్లారెడ్డి, జెడ్పీటీసీ పుష్ప, బ్రహ్మానందరెడ్డి, గంగాధర, మండల నాయకులు బాబురెడ్డి, మల్లికార్జునరెడ్డి, వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాయచోటి : ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్స్, టీ సౌకర్యాలు కల్పించారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదన్ రావు, ఎస్‌డీసీ రామసుబ్బయ్య, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలి

జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



వికలాంగుడు మోహన్ సమస్యను వింటున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని, ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం చేయరాదని జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ అర్జీలు స్వీకరించి అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడారు.వారి సమస్యలను విన్న ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడి వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు.

బాధితుడి వద్దకు ఎస్పీ

బి.కొత్తకోటకు చెందిన వికలాంగుడు మోహన్ నడవలేని స్థితిలో సోమవారం ఎస్పీ కార్యాలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్పీ తన ఛాంబర్ నుంచి గేటు వద్ద ఉన్న మోహన్ వద్దకు వెళ్లి వినతిపత్రాన్ని స్వీకరించారు. మోహన్ సమస్యను చట్ట పరిధిలో పరిష్కరించాలని మదనపల్లి డీఎస్పీని ఎస్పీ ఆదేశించారు.

సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత

జిల్లాలో పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే సందర్భంగా పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారంపై ఎస్పీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లు, ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న పోలీసు సిబ్బంది వారి వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్, మెడికల్ సమస్యల గురించి జిల్లా ఎస్పీకి స్వయంగా విన్నవించుకున్నారు. వైఎస్ఆర్ జిల్లాకు చెందిన కొంత మంది పోలీసు సిబ్బంది కూడా ఎస్పీని కలిసి సమస్యలు చెప్పుకున్నారు.

విద్యుత్ చార్జీల బాదుడుపై 27న పోరుబాట

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి తదితరులు

రాయచోటి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే పెంచిన విద్యుత్ చార్జీల మోతను నిరసిస్తూ ఈనెల 27వ తేదీన ప్రతి నియోజకవర్గంలోని విద్యుత్ కార్యాలయాల ఎదుట వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో పోరుబాటను చేపట్టనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి పేర్కొన్నారు.దీనిని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం రాయచోటిలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో పోరుబాటకు సంబంధించిన పోస్టర్లను మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, కౌన్సిలర్లు, స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా ప్రజలపై చార్జీల మోత మోగిస్తోందని అమరనాథ రెడ్డి ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే ఐదు సంవత్సరాల కాలంలో విద్యుత్ చార్జీలను పెంచమంటూ బాదుడు కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో విద్యుత్ కనెక్షన్లు తొలగించి ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. రైతుల పరిస్థితి మరింత దయనీయంగా ఉందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఒక ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చిన దాఖలా లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎక్కడా విద్యుత్ సమస్యలు ఉండేవి కాదన్నారు. రైతులు అడిగిన వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరు చేసి నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించి అన్ని వర్గాల ప్రజలకు తోడుగా నిలిచిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పిలుపు మేరకు ఈనెల 27వ తేదీ విద్యుత్ చార్జీల బాదుడుపై రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ పోరుబాట చేపడుతోందన్నారు ప్రతి నియోజకవర్గంలో ర్యాలీలు నిర్వహించి విద్యుత్‌సబ్ స్టేషన్ల ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కమిటీ మాజీ చైర్మన్ కె హరుణ్ బాషా, మన్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజ్ రహిమాన్, వీరబల్లి మండల నాయకులు, జిల్లా బీసీ నాయకులు విజయభాస్కర్, రాయచోటి పట్టణ అధ్యక్షులు రియాజుర్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

కుర్చీ కోసం రగడ

- మళ్లీ రెచ్చిపోయిన కడప రెడ్డెమ్మ
- ఈసారి సభలోనూ మేయర్‌తో సమానంగా కుర్చీ వేయాలని ఎమ్మెల్యే మొండిపట్టు
- పార్టీ ఫిరాయింపు కార్పొరేటర్లదీ ఆమె మాటే..
- అరుపులతో దద్దరిల్లిన సభ



ప్లకార్డు ప్రదర్శిస్తూ మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

కడప కార్పొరేషన్ : గతంలో జరిగిన నగర పాలక సమావేశంలో 'కుర్చీ' కోసం రెచ్చిపోయిన కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవీ రెడ్డి.. సోమవారం జరిగిన సమావేశంలోనూ 'కుర్చీ' కోసం కొట్లాటను కొనసాగించారు. తనకు కుర్చీ వేసేంత వరకూ నగరపాలక సర్వసభ్య సమావేశం జరగనివ్వను... అనేంతగా మొండి పట్టుదల ప్రదర్శించారు. ఆమె సభలో ఉన్న సుమారు 3 గంటలపాటు ఏ చైర్‌లోనూ కూర్చోకుండా నిల్చొనే ఉన్నారు. ఈ క్రమంలో 'నీవు అవినీతి పరుడివి' అంటూ మేయర్‌ను, 'మేయర్ బువ్వ పెడతాడు తినిరాపోండి, ఆడవాళ్లుగా పుట్టినందుకు సిగ్గుపడండి'.. అంటూ వైఎస్సార్‌సీపీ మహిళా కార్పొరేటర్లపై పరుష పదజాలం ప్రయోగించారు. నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల ఫోటోలు తీయాలని తన సిబ్బందిని కనుసైగలతో ఆదేశిస్తూ వారిని బెదిరించారు. మేయర్, కార్పొరేటర్లపైకి గుడ్లు ఉరుముతూ దూసుకుపోయారు. ఈ క్రమంలో పలుసార్లు వాగ్వాదాలు, తోపులాటలు జరిగాయి. ఎమ్మెల్యే ప్రోద్బలంతో టీడీపీలోకి పార్టీ ఫిరాయించిన కార్పొరేటర్లు కూడా రెచ్చిపోయారు. ఎజెండా చదువుతున్న ఉద్యోగి మైక్ లాక్కొనేందుకు పలుసార్లు ప్రయత్నించారు. ప్రతిసారీ చదువుతున్న ఎజెండా పేపర్లను లాక్కొని చించివేశారు. పార్టీ ఫిరాయించిన మహిళా కార్పొరేటర్లు దూసుకురావడంతో మేయర్ కుర్చీ కుదుపులకు గురైంది. ఇదిలా ఉండగా 'ఎజెండాకు ప్రాధాన్యమివ్వండి, ప్రజా సమస్యలపై చర్చించండి, సభా మర్యాదను పాటించండి, సీటు కోసం కాదు...ప్రజా సమస్యల పరిష్కారంపై పోరాడండి... మేయర్ ఇంటి వద్ద చెత్త వేసినందుకు క్షమాపణ చెప్పాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు పోడియంపై నేల మీద కూర్చొని నిరసన తెలిపారు. మరోవైపు 'పూర్వ సాంప్రదాయం పాటించండి, మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడండి' అంటూ టీడీపీ కార్పొరేటర్లు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సభ జరగకుండా రచ్చ చేస్తున్న ఎక్స్ అఫిషియో సభ్యురాలు, ఎమ్మెల్యే మాధవి, 8 మంది ఫిరాయించిన కార్పొరేటర్లను సస్పెండ్ చేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. అయినా సభ నియంత్రణలోకి రాకపోవడంతో సభను మధ్యాహ్నానికి వాయిదా చేశారు. మధ్యాహ్నం 2.30 గంటలకే సస్పెండ్ అయిన కార్పొరేటర్లు మేయర్ పోడియంపైకి ఎక్కి చైర్ వెనుక నిలబడి ప్లకార్డులు ప్రదర్శించారు. ఎమ్మెల్యేకు జరుగుతున్న అన్యాయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. 3 గంటలకు సభ ప్రారంభం కాగానే ఎమ్మెల్యే మాధవి మైక్ తీసుకొని మాట్లాడుతూ మీరు మాత్రం మాంసం, చికెన్ తిని వచ్చి మీడియాకు, పోలీసులకు పప్పన్నం పెడతారా...మీకు సిగ్గులేదా...ఆడవాళ్లుగా పుట్టినందుకు సిగ్గుపడండి అంటూ దూషించారు. దీనికి మేయర్, కార్పొరేటర్లు సమాధానమిస్తూ భోజన ఏర్పాట్లన్నీ కమిషనరే చూసుకుంటారని, అది తమకు సంబంధం లేని విషయమని తెలిపారు. ఇలా అరుపులు, కేకల మధ్యలోనే ఎజెండా అంశాలు అందరికీ ఇవ్వడం జరిగిందని, ఈ అంశాలను మీరు ఆమోదిస్తున్నారా...అని మేయర్ అనగానే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లంతా ఆమోదిస్తున్నాం...అంటూ చేతులెత్తారు. దీంతో ఎజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు మేయర్ ప్రకటించారు.

తూటాల కలకలం.. చిక్కుముడి వీడినట్లేనా?

- పరారీలో వేటగాళ్లు.. ఆనవాళ్లు గుర్తించామంటున్న పోలీసులు?
- అసలు దోషులను తప్పించే ప్రయత్నంలో పోలీసులపై రాజకీయ ఒత్తిడులు



రాయచోటి : రాయచోటి రూరల్ మండలం, మాధవరం అటవీ ప్రాంతంలో కలకలం రేపిన తుపాకీ కాల్పుల ఘటనకు సంబంధించి వేటగాళ్ల ఆనవాళ్లను పోలీసులు పసిగట్టినట్లు సమాచారం. తుపాకులతో అడవి జంతువులకోసం వేటకు వెళ్లిన వారి వివరాలను సేకరించి గోప్యంగా వారికోసం గాలిస్తున్నట్లు తెలియవచ్చింది. ఆదివారం తెల్లవారుజామున అడవి జంతువుల వేటగాళ్ల తుపాకీ తూటాల దెబ్బకు నీలకంఠ హనుమంతు (45) మృతి చెందగా నల్ల రమణ (30) కడప రిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు ఛేదనలో రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ చంద్రశేఖర్‌లు ప్రత్యేక బృందాలతో విచారణ ప్రారంభించారు. ఈ విచారణలో మాధవరం గ్రామానికి చెందిన కొంతమంది అడవి జంతువులకోసం తెల్లవారజజామున వేట సాగిస్తున్న సమయంలో అడవి జంతువుల అలికిడిగా గుర్తించి చెట్ల చాటున ఉన్న వారిద్దరిపై కాల్పులు జరిపినట్లు స్థానిక వేగుల సమాచారం.

వేటలో మాధవరం వాసులు......

అడవి జంతువుల వేటకు వెళ్లి తుపాకులతో కాల్చిన వారంతా మాధవరం గ్రామానికి చెందిన వారుగా పోలీసులు గుర్తించిన ట్లు తెలిసింది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు గురికాని వాండ్లపల్లికి చెందిన ఒక సీనియర్ షూటర్‌తోపాటు పేయలవాండ్లపల్లి, జురుకువాండ్లపల్లి, రెడ్డివారిపల్లిలకు చెందిన వారు వేటలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు.

రాజకీయ ఒత్తిళ్లు.....

అడవి జంతువుల వేటలో భాగంగా తుపాకీ తూటాలు పేల్చిన వారిని కేసు నుంచి తప్పించేందుకు పోలీసులకు రాజకీయ ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా అధికార పార్టీకి చెందిన నాయకుల నుంచి ఒత్తిళ్లు వచ్చినట్లు తెలుస్తోంది. జరిగిన సంఘటనను నీరు గార్చే ప్రయత్నంలో భాగంగా కేసును తప్పుదారి పట్టించి అనామకులు కొంతమందిపై కేసులు నమోదు చేయించి అసలు దోషులను పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. పోలీసులు సైతం అసలు దోషులు కళ్లెదుట ఉన్నా వారిని అరెస్టు చేయలేని పరిస్థితిలో ఉన్నారన్న విమర్శలు ఉన్నాయి.

రెండురోజుల్లో వివరాలు వెల్లడిస్తాం : అర్బన్ సీఐ

తుపాకీ కాల్పుల కేసులో సమాచారం ఒక కొలిక్కి వచ్చిందని రాయచోటి అర్బన్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. వేటకు వెళ్లిన వారిని గుర్తించామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో వేటకు వెళ్లిన వారి వివరాలను బయట పెడతామని సిఐ చెప్పారు.

క్లుప్తంగా

ఎర్రచందనం స్వాధీనం.. స్మగ్లర్ అరెస్టు

తిరుపతి మంగళం : అన్నమయ్య జిల్లా బాలపల్లి అటవీ ప్రాంతంలో మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ఒక స్మగ్లర్‌ను సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ పోలీసులు బాలపల్లి అటవీ ప్రాంతంలోని గుంజనా సెక్షన్‌లో కూంబింగ్ చేపట్టారు. గంగరాజుపల్లి సమీపంలోని సున్నపురాళ్ల కోన వద్ద ఒక వ్యక్తి తచ్చాడుతూ కనిపించగా అతన్ని పట్టుకుని విచారించారు. మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ డీఎస్పీలు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెంపో వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన లతీఫ్

మదనపల్లె : టెంపో ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె మండలంలో జరిగింది. మహారాష్ట్రకు చెందిన షేక్ లతీఫ్(55) మదనపల్లె అమూల్ డెయిరీ నుంచి సామగ్రి తీసుకెళ్లేందుకు వచ్చాడు. వాహనాన్ని లోడింగ్ నిమిత్తం డెయిరీలో పార్క్‌చేసి ఎదురుగా ఉన్న రోడ్డుపై నడిచి వెళుతుండగా, చింతామణి నుంచి మదనపల్లెకు క్యారెట్ లోడ్‌తో వచ్చిన ఐచర్ టెంపో లతీఫ్‌ను ఢీకొంది. ప్రమాదంలో తలకు తీవ్ర గాయం కాగా, గమనించిన స్థానికులు ఆటోలో బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు


షబానా (ఫైల్)

మదనపల్లె : వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. కడప శంకరాపురం రామాంజనేయపురం వడ్డేపల్లెకు చెందిన సాబ్‌జాన్ భార్య చెట్టూరి షబానా(29) బెంగళూరులోని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి ఈనెల 16న కడపకు బయలుదేరింది. మార్గ మధ్యంలో మదనపల్లె ఆర్టీసీ బస్టాండులో దిగి కనిపించకుండా పోయింది. విషయం తెలుసుకున్న ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు, మిత్రుల ఇళ్లలో గాలించినా ఆచూకీ లేకపోవడంతో సోమవారం షబానా తండ్రి బంధూషా టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఎస్‌ఐ గాయత్రి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మృతుల కుటుంబ సభ్యులకు ఆకేపాటి ఓదార్పు

రాజంపేట టౌన్ : ఓబులవారిపల్లె మండలం రెడ్డిపల్లె చెరువుకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కోలాటం నరసింహా, సుజాత మృతదేహాలను సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్ అరెస్టు

ఓబులవారిపల్లె : మండల పరిధిలోని రెడ్డిపల్లి చెరువుకట్ట వద్ద ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌ను మద్యం మత్తులో ఢీకొని ఇద్దరి దుర్మరణానికి కారణమైన ఆటో డ్రైవర్ జోసెఫ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ పి.మహేష్ తన సిబ్బందితో గాలించి చిన్న ఓరంపాడు డాబా హోటల్ వద్ద నిందితుడిని పట్టుకున్నారు. కడప నుంచి తిరుపతికి ఆటోలో వెళ్తా మద్యం మత్తులో రెడ్డిపల్లి చెరువుకట్ట వద్ద ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీ కొన్నాడు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శాంతియుత వాతావరణ స్థాపనకు కృషి చేయాలి

శాంతి ర్యాలీ ప్రారంభోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి రాంప్రసాద్‌రెడ్డి. వేదికపై మానవతావాదులు

రాయచోటి అర్బన్ : ప్రపంచంలో శాంతియుత వాతావరణ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర యువజన, క్రీడలు, రవాణాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని మానవతావాదులు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సేవ్‌ఎర్త్–నోవార్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి మాట్లాడుతూ యుద్ధం వలన జనజీవనం అస్తవ్యస్తమవుతుందన్నారు. జీవితాలు తలకిందులవుతాయన్నారు. శాంతి, సామరస్యాలకు భారతదేశం పుట్టినిల్లు అన్నారు. భారత స్వాతంత్ర్య సమరం సైతం ఎక్కువ శాతం శాంతియుతంగానే సాగిందని చెప్పారు. ఎన్నో దేశాలలో యుద్ధాలు జరిగి ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగినా భారతీయులు మాత్రం శాంతియుతంగా ఉన్నారని తెలిపారు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ప్రపంచంలో శాంతి స్థాపన ప్రధాన ధ్యేయంగా రాయచోటి నుండే మొదటిగా సేవ్ ఎర్త్– నోవార్ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం అన్నారు. అనంతరం సేవ్‌ఎర్త్– నోవార్ సంస్థ ఫౌండర్ సతీష్‌కుమార్, వైద్యుడు బయారెడ్డి, ఇంటాక్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, నాగేశ్వరరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం స్థానిక నేతాజి సర్కిల్‌లో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే షాజహాన్‌లు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీలో లయన్స్, రోటరీక్లబ్, మానవత సంస్థల సభ్యులు, పుర ప్రముఖులతో పాటు వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బలోపేతానికి ప్రత్యేక చర్యలు

రాయచోటి అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఆర్టీసీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర రవాణా శాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం ఎస్‌ఎన్ కాలనీలోని శివాలయం సర్కిల్‌లో ఆయన 8 నూతన ఆర్టీసీ బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ప్రయాణికుల సౌకర్యం కోసం మరిన్ని నూతన బస్సులు ప్రారంభించామన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను త్వరలోనే నెరవేరుస్తామన్నారు. రాబోయే కాలంలో ఆర్టీసీని పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రయాణికులకు నాణ్యమైన సేవలను అందిస్తామన్నారు. రాబోయే రోజుల్లో ఎలక్ట్రికల్ బస్సులను ఎక్కువగా వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు కార్యక్రమంలో డీపీటీఓ రాము, డీఎం ధనుంజయ, పలువురు ఆర్టీసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కరుణామయుడు ఏసుక్రీస్తు

- మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జాయింట్ కలెక్టర్
- కలెక్టరేట్‌లో ఘనంగా క్రిస్మస్ హైటీ కార్యక్రమం


క్రిస్మస్ ముందస్తు వేడుకల్లో భాగంగా కేక్‌ను కోస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయచోటి : ఏసుక్రీస్తు ఆరాధ్యుడు, దయామయుడు, కరుణామయుడని రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున క్రిస్మస్–2024 హైటీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రోమ్ సామ్రాజ్యంలో జన్మించిన ఏసుక్రీస్తు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాదిమందికి ఆరాధ్యుడుగా క్రైస్తవులతో ఆరాధనలు అందుకుంటున్నారన్నారు. ప్రభుత్వం క్రిస్మస్ పండుగను రాష్ట్ర పండుగగా గుర్తించి ప్రభుత్వం తరపున సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. క్రిస్మస్ అంటే శాంతికి చిహ్నమని, రాష్ట్ర ప్రజలు శాంతియుతంగా సుఖసంతోషాలతో జీవించాలని కోరుకుంటున్నట్లు మంత్రి తెలిపారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ మాట్లాడుతూ కరుణ, దయ, దాతృత్వం కల్గిన ఏసుక్రీస్తు బోధనలు సర్వ మానవాళికి దారి చూపుతాయన్నారు. ఏసుక్రీస్తు జన్మదినమైన క్రిస్మస్ పండుగ రోజున ప్రజలంతా సుఖసంతోషాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. క్రిస్మస్ హైటీ కార్యక్రమంలో భాగంగా మంత్రి కేక్ కట్ చేసి క్యాండిల్ వెలిగించి క్రైస్తవ సోదరులందరికీ రాష్ట్ర ప్రభుత్వం తరపున క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మధుసూదన్ రావు, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి షేక్ ఇమ్రాన్, పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ చంపేస్తోంది.. దాతలు ఆదుకోండి

పదినెలల పాప కోసం తనను బతికించాలంటూ వేడుకోలు


దాతలు ఆదుకోవాలని అభ్యర్థిస్తున్న భార్గవి, రవీందర్‌నాయక్, చిన్నారి

మదనపల్లె : అభం శుభం తెలియని పదినెలల చిట్టితల్లి. ప్రాణాంతక వ్యాధితో చనిపోతే పాపను పట్టించుకునే దిక్కు లేరు. బిడ్డ కోసమైనా బతకాలని ఉంది. దయచేసి దాతలు ప్రాణభిక్ష పెట్టండయ్యా అంటూ ఓ అభాగ్యురాలు వేడుకుంటోంది. సోమవారం మదనపల్లె ప్రెస్‌క్లబ్‌లో తన గోడు చెప్పుకుంటూ సాయం కోసం అర్థించింది. మదనపల్లె పట్టణం దిగువకమ్మపల్లెకు చెందిన భార్గవి, రవీందర్ నాయక్ భార్యాభర్తలు. వీరికి పదినెలల పాప విభావరి ఉంది. భార్గవి ఇళ్లలో పాచిపనులు చేసుకుంటుంటే, రవీందర్ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రెండునెలల క్రితం పని చేస్తున్న క్రమంలో పొరపాటున భార్గవి కిందపడింది. మోకాలి వద్ద గాయం కావడంతో చికిత్స చేయించుకుంది. అయితే గాయం ఎప్పటికీ నయం కాకపోవడంతో, పరీక్షలు చేయిస్తే బోన్ క్యాన్సర్‌గా నిర్ధారణ జరిగింది. రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితుల్లో జీవిస్తున్న తమ పాలిట క్యాన్సర్ మహమ్మారి పిడుగులా మారిందని వాపోయింది. తెలిసిన వారి దగ్గర అప్పులు చేసి సుమారు రూ.లక్ష వరకు ఖర్చుచేసి వైద్యం చేయించుకున్నప్పటికీ జబ్బు నయం కాలేదని చెప్పింది. తిరుపతి స్విమ్స్, బర్డ్ హాస్పిటల్, బెంగళూరులోని వైదేహి హాస్పిటల్‌లో వైద్యులు పరీక్షించి, చాలా తీవ్రమైన జబ్బని, సర్జరీ చేస్తే తప్ప నయం కాదని, రూ.10లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారంది. దీంతో దిక్కుతోచని స్థితిలో స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను కలిసి పరిస్థితిని వివరించామన్నారు. ఆయన ఆరోగ్యశ్రీ వాళ్లతో మాట్లాడితే.. ఈ జబ్బుకు ఆరోగ్యశ్రీ వర్తించదని చెప్పడంతో మరింత కుదేలై పోయామంది. సర్జరీ చేయించుకుని తాను తిరిగి మామూలు మనిషి కావాలంటే వైద్య చికిత్సలకు రూ.10లక్షలు కావాల్సి ఉందని, దాతలు స్పందించి తనకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంది.

సర్దుబాటుతోనే సమస్య పరిష్కారం

వీరబల్లి : ఇరు వర్గాల వారు సర్దుబాటు అయితేనే భూ సమస్య పరిష్కారం అవుతుందని జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి భరత్ కుమార్ తెలిపారు. మండలంలోని కమ్మపల్లిలో నివాసం ఉంటున్న కొల్లి నాగయ్య, కోవూరు సుబ్బయ్యల మధ్య గత కొన్ని సంవత్సరాల నుంచి భూ సమస్యపై వివాదం జరుగుతూనే ఉంది. నాగయ్య ఫిర్యాదు మేరకు జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి భరత్ కుమార్, సర్వే తనిఖీదారు పి. ప్రసాద్ కలిసి సోమవారం అమ్మపల్లెలో భూ సమస్యకు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఈ భూమికి సంబంధించి హద్దులు తప్ప కొలతలు లేకపోవడం, సబ్ డివిజన్ కాకపోవడం వలన ఈ సమస్యను తాము పరిష్కరించలేమని, ఇరు వర్గాల వారు సర్దుబాటు అయితే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. లేకుంటే కోర్టుకు వెళ్లాలని సూచించారు.

ముగిసిన కళ్లద్దాల టెండర్ల ప్రక్రియ

రాయచోటి (జగదాంబసెంటర్) : జాతీయ అంధత్వ, దృష్టి లోప నియంత్రణ కార్యక్రమంలో భాగంగా కంటి అద్దాల టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బడికి వెళ్లే విద్యార్థుల్లో అంధత్వం, దృష్టి లోపం నివారణ కోసం జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమంలో భాగంగా 3200 కళ్లద్దాల కోసం ఈ నెల 14న టెండర్ నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. అందిన దరఖాస్తులను సోమవారం ఉదయం జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్ ఆధ్వర్యంలో జిల్లా ప్రొక్యూర్మెంట్ కమిటీ తనిఖీ చేసిందన్నారు. తక్కువ కొటేషన్ ఇచ్చిన రాయచోటికి చెందిన మస్తాన్‌కు 3200 కళ్లద్దాల తయారీ పనిని అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని బసినికొండ పంచాయతీ డ్రైవర్స్ కాలనీకి చెందిన షేక్ హమీదుల్లా కుమారుడు సిద్ధిక్ అమీన్(20) స్థానికంగా ఓ యువతిని ప్రేమించాడు. అయితే వివాహం చేసుకునేందుకు ఇంట్లో అంగీకరించకపోవడంతో మనస్తాపం చెంది ఆదివారం రాత్రి ఇంటివద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రమాదంలో యువకుడి గొంతుకు గాయం కాగా గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. ములకలచెరువు మండలం ఆవులపల్లెకు చెందిన కిట్టప్ప భార్య రమణమ్మ కుటుంబ సమస్యల కారణంగా ఇంటివద్దే పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బోరెడ్డిగారిపల్లిలో దారుణ హత్య

పోలీసు స్టేషన్‌లో లొంగిపోయిన నిందితుడు


హత్యకు గురైన మల్లెల వెంకటరమణ

గాలివీడు : గాలివీడు మండలం బోరెడ్డిగారిపల్లి సమీపంలో మల్లెల వెంకటరమణ అలియాస్ సత్తెన్న(28) అనే వ్యక్తిని అతి కిరాతకంగా హతమార్చారు. ఆవేశంలో ఈ హత్య తానే చేశానంటూ నిందితుడు రమణారెడ్డి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం బోరెడ్డిగారిపల్లిలో పెద్దకర్మ సందర్భంగా వీధినాటకం వేసేందుకు వెళ్లిన నక్కలవాండ్లపల్లె బృందంలో అదే గ్రామానికి చెందిన నిందితుడు రమణారెడ్డి ఒక పాత్ర పోషించాడు. నూలివీడు గ్రామం కొత్త బండివాండ్ల పల్లెకు చెందిన మృతుడు వెంకటరమణ బఫూన్‌గా మరో పాత్ర పోషించాడు. నాటకంలో వారిరువురి మధ్య పాత్రల పరంగా చిన్న వాగ్వాదం చోటుచేసుకోగా స్థానికులు సర్దిచెప్పారు. నాటకం ముగిసిన అనంతరం బస్సు కోసం వారు ప్రధాన రహదారిపై బస్ షెల్టర్ వద్దకు రాగానే వారిరువురి మధ్య వాగ్వావాదం హెచ్చుమీరి ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. దీంతో కోపోద్రిక్తుడైన రమణారెడ్డి అతి కిరాతకంగా వెంకటరమణను బండరాళ్లతో కొట్టి హతమార్చి సమీపంలోని మంగలపల్లి గుట్టలో పడేశాడు. ఉదయం బోరెడ్డిగారిపల్లి బస్‌స్టాప్ వద్దకు వచ్చిన ప్రయాణికులు రోడ్డుపై ఉన్న రక్తపు మరకలను చూసి భయభ్రాంతులై పోలీసులకు సమాచారం ఇచ్చారు. దిక్కుతోచని స్థితిలో నిందితుడు రమణారెడ్డి పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తానే హత్య చేసినట్లుగా ఒప్పుకుని పోలీసులకు లొంగిపోయాడు. మృతుని సోదరుడు ఆంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.

వాహనాల అద్దెను వెంటనే చెల్లించాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కారు డ్రైవర్లు, యజమానులు

రాయచోటి అర్బన్ : గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రభుత్వ విధుల కోసం వినియోగించిన వాహనాల అద్దెను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, కార్యదర్శి జి.ప్రభాకరరెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో తమకున్న బకాయిలను వెంటనే చెల్లించాలని అద్దె వాహనాల యజమానులు, డ్రైవర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె, తంబళ్లపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల విధులకు సంబంధించి రెండు నెలల కోసం 42 వాహనాలను అధికారులు వినియోగించారన్నారు. కాగా వాహనాల చెల్లింపు కోసం ప్రభుత్వం మంజూరు చేసిన బడ్జెట్‌ను అధికారులు ఇతర అవసరాల కోసం వినియోగించుకుని తమకు మొండిచేయి చూపడం దారుణమన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వారు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో క్యాబ్ డ్రైవర్ల యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ సాహెబ్, వహాబ్, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న భూనిర్వాసితులు

రాయచోటి అర్బన్ : జీఎన్‌ఎస్‌ఎస్– హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అనుసంధాన పైపులైన్ పథకం నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం అనుసంధాన పైపులైన్ ప్రాజెక్టు నిర్వాసితులైన రైతులతో కలిసి ఆయన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప– అన్నమయ్య జిల్లాల్లో సుమారు 2 లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యాన్ని స్థిరీకరించడంతో పాటు తాగునీటిని అందించడమే లక్ష్యంగా జీఎన్‌ఎస్‌ఎస్, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అనుసంధాన పైపులైన్ పథకాన్ని ప్రభుత్వం రూ.4,374 కోట్లతో చేపట్టిందన్నారు. రెండేళ్లలో కాలువ నిర్మాణం పనులు కూడా జరగలేదన్నారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం యిచ్చి పునరావాసం కల్పించాల్సిన ప్రభుత్వ పెద్దలు నేటికీ నష్టపరిహారం చెల్లించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు, రైతులు శంకర్, భాస్కర్, పవన్, శ్రీనివాసులు, మస్తాన్‌రెడ్డి, ఎరుకలరెడ్డి, నరసింహులు, సుగుణ, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డ్వాక్రా గ్రూపుల మహిళలు

రాయచోటి అర్బన్ : గ్రామ సమాఖ్య సంఘమిత్ర లక్ష్మీనరసమ్మ పేరును అకారణంగా ఆన్‌లైన్ నుంచి తొలగించిన గత వెలుగు ఏపీఎం మురళిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్‌చేశారు. అకారణంగా తొలగించిన సంఘమిత్ర లక్ష్మీనరసమ్మకు న్యాయం చేయాలంటూ సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బి.కొత్తకోట మండలం 17వ గ్రామ సమాఖ్య సంఘమిత్రగా దాదాపు 14 సంవత్సరాలుగా లక్ష్మీనరసమ్మ పనిచేస్తున్నారన్నారు. తంబళ్లపల్లె టీడీపీ కీలక నేత చెప్పారంటూ ఆమె పేరును ఆన్‌లైన్ నుంచి బి.కొత్తకోట ఏపీఎం మురళి తొలగించారన్నారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని లక్ష్మీనరసమ్మను యథావిధిగా సంఘమిత్రగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు ఎస్.శ్రీనివాసులు, విశ్వనాథనాయక్, డీహెచ్‌పీఎస్ అధ్యక్షుడు హరి, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు నేలపాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


మృతి చెందిన రైతు రుద్ర శివానందరెడ్డి


వేంపల్లె : వేంపల్లె మండలం టి.వెలమవారిపల్లె గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై రుద్ర శివానందరెడ్డి (40)అనే రైతు మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఉదయం 6 గంటలకు చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలోని టి.వెలమవారిపల్లె గ్రామానికి చెందిన రుద్ర శివానందరెడ్డి అనే రైతు 12 ఎకరాల వ్యవసాయ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. దీనిలో అరటి, నిమ్మ పంటలను సాగు చేశాడు. అరటి పంటకు మందు కొట్టేందుకు నీరు అవసరం కాగా, సోమవారం ఉదయం రంగారెడ్డి అనే వ్యక్తితో కలిసి రుద్ర శివానందరెడ్డి అరటి తోట వద్దకు వెళ్లాడు. వ్యవసాయ బోరుకు చెందిన మోటార్‌ను ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు రుద్ర శివానందరెడ్డికి తెగిన విద్యుత్ వైర్లు చేతికి తగిలి విద్యుత్ షాక్ కొట్టింది. దీంతో కింద పడిపోవడంతో అతన్ని కాపాడబోయిన రంగారెడ్డికి కూడా విద్యుత్ షాక్ కొట్టడంతో పెద్దగా కేకలు వేశారు. పక్క పొలంలో ఉన్న అతని అన్న వెంకట్రామిరెడ్డి కేకలు విని సంఘటన స్థలానికి వచ్చి గమనించి విద్యుత్ సిబ్బంది సమాచారం ఇచ్చాడు. విద్యుత్ సరఫరాను నిలిపి వేసి చూడగా అప్పటికే రైతు రుద్ర శివానందరెడ్డి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య రమాదేవితోపాటు తిరుపతి రెడ్డి, ప్రకాష్ రెడ్డి, రెడ్డి నవీన్ రెడ్డి అనే ముగ్గురు కుమారులు ఉన్నారు. రైతు మృతితో టి.వెలమవారిపల్లెలో విషాద ఛాయలు అలుముకున్నాయి. జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి రైతు మృతదేహం వద్ద శ్రద్ధాంజలి ఘటించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రైళ్లకు వాటరింగ్‌కు నందలూరు అనుకూలం


తల్లెం భరత్ కుమార్‌రెడ్డి

రాజంపేట : జిల్లాలో రైల్వేపరంగా ప్రసిద్ధి చెందిన నందలూరు రైల్వే కేంద్రంలో అన్ని రైళ్లకు నీటిని నింపేందుకు వాటరింగ్ ఏర్పాటు చేయాలని, ఇక్కడ పుష్కలంగా నీటి వనరులు ఉన్నాయని గుంతకల్ డివిజనల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇక్కడ వాటరింగ్ అమలు చేస్తే తిరుపతి, రేణిగుంటలో లైన్ల రద్దీ భారం తగ్గుతుందన్నారు. అలాగే రైల్‌నీర్ పరిశ్రమ ఏర్పాటుకు నందలూరు రైల్వే కేంద్రం అనుకూలమన్నారు. వచ్చేనెల 8న గుంతకల్‌లో డీఆర్‌యూసీసీ సమావేశం జరుగుతుందని అందులో రాజంపేట, నందలూరు, రైల్వేకోడూరు ప్రాంత రైల్వే సమస్యలను డివిజన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇంకా పలు సమస్యలను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

విద్యార్థి కాలిపై బ్లేడ్‌తో కోసిన ప్రిన్సిపల్


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి కార్తీక్

రాయచోటి : కళాశాలలో స్టడీ అవర్‌కు రావడం లేదని కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ ఇంటర్ విద్యార్థి కార్తీక్ కాలుపై బ్లేడుతో కోశాడు. పెట్టాడు. ఈ సంఘటన సోమవారం చోటు చేసుకుంది. గాయపడిన విద్యార్థిని ఆసుపత్రికి తరలించారు. రాయచోటిలోని శ్రీ సాయి ఇంజినీరింగ్ కళాశాలలో భాగమైన ఇంటర్మీడియట్ కళాశాలలో కార్తీక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొద్ది రోజులుగా సాయంత్రం వేళ కళాశాలలో జరుగుతున్న స్టడీ అవర్‌కు కార్తీక్ రాకపోవడం పట్ల ప్రిన్సిపల్ మందలించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో సోమవారం సాయంత్రం స్టడీ అవర్‌కు వచ్చిన కార్తీక్ పట్ల ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు బ్లేడుతో కాలిపై కోసినట్లు విద్యార్థి పోలీసులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనపై రాయచోటి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

ఈశ్వరీదేవి మఠం.. ఉత్సవ శోభితం

- వైభవంగా ఈశ్వరీదేవి ఆరాధనోత్సవాలు
- భారీగా తరలి వస్తున్న భక్తులు
- ఘనంగా ఏర్పాట్లు


విద్యుత్ దీప అలంకరణలో ముఖద్వారం


అశ్వవాహనంపై అమ్మవారి ఊరేగింపు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని ఈశ్వరీదేవి మఠం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాల సందర్భంగా నూతన శోభ సంతరించుకుంది. మిరుమిట్లు గొలిపే విద్యుత్ కాంతులతో ధగధగలాడుతోంది. ఆలయానికి రంగులతో మెరుగులద్దారు. దేవాలయంతోపాటు పరిసరాలను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. ఆకట్టుకునేలా ముఖద్వారాన్ని తీర్చిదిద్దారు. ఆరాధనోత్సవాల్లో రెండో రోజైన సోమవారం వేడుకలు కమనీయంగా నిర్వహించారు. ఈశ్వరీదేవికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు చేపట్టారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామిమఠం రెసిడెన్షియల్ స్కూల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో చేపట్టిన చెక్క భజన భక్తులను అలరించింది. కందిమల్లాయపల్లెలోని వీరనారాయణపురం వారి గోవిందమాంబ కోలాటం బృందం చేసిన కోలాటం ఆకట్టుకుంది. మధ్యాహ్నం ఉత్సాహ భరితంగా అశ్వవాహనోత్సవం జరిగింది. అమ్మవారు అశ్వవాహనంపై ఆశీనులై భక్తులను ఆశీర్వదించారు. సాయంత్రం తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు సంగీత విభావరి ప్రదర్శించారు. రాత్రి హంస వాహనోత్సవం కనుల పండువగా జరిగింది. ఉభయ దాతలుగా బద్వేలు మండలం కుమ్మరకొట్టాలుకు చెందిన గోవిందిన్నె సుబ్బరాయుడు ఆచారి, విజయలక్ష్మి, విజయవాడకు చెందిన గుంటముక్కల ఉమామహేశ్వరరావు, నిర్మల, బ్రహ్మంగారిమఠం మండలం బొగ్గులవారిపల్లెకు చెందిన బొగ్గుల ఈశ్వర నారాయణరెడ్డి, శారదాంబ, గోవిందరెడ్డి, నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన వంక వేణుగోపాల్, సుగుణమ్మ, బ్రహ్మానందరెడ్డి, సునీత దంపతులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ వారు అల్పాహారం పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా మఠాధిపతి శ్రీ వీరశివకుమారస్వామి ఆశీస్సులతో ఈఓ బీవీ జగన్‌మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో దేవదాయ శాఖ, మఠం సిబ్బంది ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో శ్రీ ఈశ్వరీమాత సేవా సమితి ట్రస్టు చైర్మన్ కమ్మరి పార్వతమ్మ, రాష్ట్ర విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు, న్యాయ సలహా కమిటీ చైర్మన్ గురుప్రసాద్, షరాబు చంద్రమౌళి ఆచార్యులు, రాష్ట్ర మహిళా కమిటీ గౌరవాధ్యక్షురాలు వాసవి, అధ్యక్షురాలు అంగల కుదుటి సుశీల, ఉపాధ్యక్షురాలు షరాబు రమాదేవి, ప్రధాన కార్యదర్శి సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రధాన వేడుక

ఈశ్వరీదేవి 1789లో మార్గశిర బహుళ నవమి నాడు సజీవ సమాధి నిష్ఠ వహించారు. అప్పటి నుంచి ఏటా అమ్మవారి ఆరాధన గురుపూజోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది బహుళ నవమి మంగళవారం ప్రధాన వేడుక నిర్వహిస్తున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు భారీగా తరలి వస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే వారి కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. ఇప్పటికే అధిక సంఖ్యలో చేరుకున్నారు. మహిళా భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర సమర్పిస్తారు. అనంతరం సామూహిక కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఇందులో మఠాధిపతి దంపతులు పాల్గొంటారు. మధ్యాహ్నం జగన్మాతకు దీక్షా బంధన అలంకరణ ఉంటుంది. రాత్రి సింహవాహన గ్రామోత్సవం, తులాభారం, సహస్ర దీపాలంకరణ తదితర కార్యక్రమాలు ఉంటాయి.